# అంధేరా ప్రభుత్వం

## (మినీకథ)

–మల్లాది వెంకట కృష్ణమూర్తి

అనగనగా ఓ రోజు ఓ అంధేరా ప్రభుత్వం, ఎడారిలోని తమ గిడ్డంగిలో బోలెడంత ఇసక వుందని తెలుసుకొని, కళ్ళు తెరిచింది. ముఖ్యమంత్రి తన ముఖ్య సలహాదారయిన ఓ ఐ.ఎ.ఎస్. ఆఫీసర్‌ని ఆ విషయం మీద సలహా కోరాడు.

సర్. దాన్ని ఎవరైనా దొంగిలించవచ్చు. ముందు ఆ సంగతి చూడాలి. సలహా ఇచ్చాడు ముఖ్య సలహాదారు.

దాంతో మళ్ళీ నైట్ వాచ్‌మేన్, డే వాచ్‌మేన్, ఆఫ్టర్‌నూన్ వాచ్‌మేన్ అనే మూడు వుద్యోగాలని సృష్టించారు వాళ్ళని ఎపాయింట్ చేశాక ముఖ్య సలహాదారు ముఖ్యమంత్రికి చెప్పాడు.

"వారిలో ఎవరయినా శెలవపెడితే అతని డ్యూటీని భర్తీ చేసేందుకు 'లోకల్ రిజర్వ్'గా ఇంకో వాచ్‌మేన్ అవసరం సర్" అదీ జరిగింది.

"వాచ్‌మేన్‌లకు తగిన సూచనలు లేకుండా వాళ్ళ పని ఎలా నిర్వహించగలరు సార్? వాళ్ళేదైనా తప్పు చేస్తే ' ఇది సూచనలకి భిన్నమైంది' అనడానికి మన దగ్గరేం లేదుకదా?" సజెస్ట్ చేశాడా ఐ.ఎ.ఎస్. ఆఫీసర్.

దాంతో వారు ప్లేసింగ్ విభాగాన్ని సృష్టించి, సర్వీస్ మేన్యువల్ రాయడానికి ఇద్దర్ని, దాన్ని వాచ్‌మేన్‌లకు టీచ్ చేయడానికి ఇంకొకర్ని అపాయింట్ చేశారు. వాచ్‌మేన్‌లకి మేన్యువల్ కాపీలనిచ్చి పరీక్షలు కూడా నిర్వహించారు. ప్రోత్సాహకరంగా వుంటుందని ఉత్తీర్ణులైనవారికి ఇంక్రిమెంట్స్ కూడా ఇవ్వాలని, నిర్ణయించారు.

ముఖ్య సలహాదారు వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రికిలా సూచించాడు.

"వాళ్ళు మన మేన్యువల్ ప్రకారం పని చేస్తున్నారో లేదో తెలుసుకోకపోతే ప్రభుత్వం వాళ్ళ మీద కంట్రోల్‌ని కోల్పోతుంది సర్. అందుకని..."

ఆ సలహా ప్రకారం టాస్క్‌ఫోర్స్ పార్టీ నొకదాన్ని సృష్టించి అందులోకి నలుగుర్ని తీసుకున్నారు. వాళ్ళు తరచూ అన్ని వేళల్లో సర్‌ప్రయిజ్ చెక్‌చేసి వాచ్‌మెన్‌ల పనిమీద నిఘా వేసి వుంచసాగారు. వాళ్ళు నియమం ప్రకారం తమ చెక్స్ గురించిన రిపోర్ట్‌లని రాసి పంపసాగారు.

మరో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రికి ముఖ్య సలహాదారు సూచించాడు.

సర్ ఆ రిపోర్ట్‌లని పరిశీలించడానికి, వారి జీతాల వ్యవహారం చూడటానికి మనం ఓ పని చేయాల్సి వుంటుంది సర్..."

ఆ ప్రకారం ఎడ్మినిస్ట్రేటివ్ వింగ్ నొకదాన్ని ఏర్పరిచి పేరోల్ ఆఫీసర్, టైమ్‌కీపర్, రిపోర్ట్‌లని పరిశీలించే ఆఫీసర్ ఉద్యోగాలని సృష్టించి వాటిలోకి సమర్థులయిన ముగ్గురు ఉద్యోగస్థుల్ని తీసుకున్నారు.

"సర్. ఈ ఏడ్గాది ఇసక రక్షణ" వ్యవహారంలో చాలామంది వుద్యోగస్థులున్నారు. అయితే వారు ఎవరికీ జవాబుదారులుగా లేరు. ఒక అకౌంట బిలిటీ చీఫ్ ప్రధానాధికారి ముఖ్యం సర్" ముఖ్య సలహాదారు కొంతకాలానికి మళ్ళీ ముఖ్యమంత్రికి సలహా ఇచ్చాడు.

అయితే ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లంతా ఏదో ఓ పోస్ట్‌లో వుండటంతో ఓ స్పెషల్ ఆఫీసర్‌కి (ఆ ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ తమ్ముడే) హడావిడిగా ఐ.ఎ.ఎస్. పోస్ట్‌కి ప్రమోషన్ ఇచ్చి అతన్ని దానికి హెడ్‌గా నియమించారు. ఆయన కింద పి.ఏ., కారు డ్రయివర్, లీగల్ సెక్రటరీ లాంటి మందీ



మార్బలం అందర్నీ నియమించారు.

ఈ విధంగా నాలుగేళ్ళు గడిచాక ఓ రోజు ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ ఈ ఇసక రక్షణ శాఖని పూర్తిగా ఆడిట్‌చేసి తమ ఆడిట్ రిపోర్ట్ ఇలా ఇచ్చారు.

"ఈ శాఖ తమ బడ్జెట్‌కి మించి కోటి ఎనభై లక్షల డెభ్భై ఏడువేల నాలుగు వందల రెండు రూపాయల ఎనభై ఆరు పైసలని హెచ్చుగా ఖర్చుచేయడం ఆక్షేపణగా వుంది."

ముఖ్యమంత్రి, ఆయన సలహాదారు ఈ ఆడిట్ రిపోర్టు మీద తర్జన భర్జనలు జరిపాక వాచ్‌మేన్‌ల పోస్టులన్నింటిని రద్దు చేసేశారు.

టేక్స్ రెవిన్యూ పెరిగాక తిరిగి ఆ శాఖని తగిన బడ్జెట్ కేటాయించి పునర్వ్యవస్థీకరించాలని, అంతదాకా ఆ శాఖలోని పరివారాన్ని ఇతర శాఖల్లో సర్దాలని కూడా నిర్ణయించారు.

○